# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- గత దశాబ్దంగా రైతులకు సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రచారం చేసిన సామాజిక-ఆర్థిక సమానత్వం భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి భూషణ్ గవాయ్ అన్నారు.

- దేశ జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 22 శాతం పెరగాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రోడ్లు, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

- దేశంలో దాదాపు 18 వేల 900 అవయవదాన శస్త్రచికిత్సలు చేయడం ఒక కీలకమైన మైలురాయిగా కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అభివర్ణించారు.

==============================

గత దశాబ్దంగా రైతులకు సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ఆయన ఈ రోజు 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులను విడుదల చేశారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9 కోట్ల 70 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 20 వేల 500 కోట్ల రూపాయలను నేరుగా బదిలీ చేశారు. అదే విధంగా 2 వేల 200 కోట్ల రూపాయల విలువైన 52 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో నరేంద్రమోదీ మాట్లాడుతూ... ప్రభుత్వం రైతుల కోసం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. అలాగే, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇప్పటివరకు 1.75 లక్షల కోట్ల రూపాయల క్లెయిమ్ లను రైతులకు ఇచ్చామని నరేంద్ర మోదీ పేర్కొంటూ..

(వాయిస్ 38 సెకన్లు)

==============================

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రచారం చేసిన సామాజిక, ఆర్థిక సమానత్వం భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో డాక్టర్ అంబేద్కర్ కళాశాల వజ్రోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళా సాధికారత సాధించడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఆయన భావజాలాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని కూడా బీ.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో దాదాపు 18 వేల 900 అవయవ దాన శస్త్రచికిత్సలు చేయడం కీలకమైన మైలురాయిగా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అభివర్ణించారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 15వ అవయవదాన దినోత్సవాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ఇది ఒకే సంవత్సరంలో అత్యధికమని అన్నారు. 2023లో మూడు లక్షలకు పైగా పౌరులు జాతీయ అవయవ కణజాల మార్పిడి సంస్థ ద్వారా అవయవ దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారని తెలిపారు. అవయవ మార్పిడిలో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా మూడవ స్థానంలో ఉందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ డిజిటల్ చెల్లింపులలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) ఈ ఏడాది జూలై నెలలో 1,947 కోట్ల రూపాయల లావాదేవీలతో కొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గణాంకాలు గత సంవత్సరంతో పోలిస్తే 35 శాతం పెరుగుదలగా ఉంది. ఈ విధంగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో UPI తన ఆధిపత్యాన్నికొనసాగిస్తోంది. రోజువారీ సగటు UPI లావాదేవీల సంఖ్య చూస్తే కనుక జూలై నెలలో 80 వేల 131 కోట్ల రూపాయల నుండి 80 వేల 919 కోట్ల రూపాయలకు చేరుకుంది. అలాగే జూలైలో పెరిగిన ఈ డిజిటల్ చెల్లింపులతో టైర్ 2, టైర్ 3 మార్కెట్లలోకి UPI ప్రవేశించింది. UPI పై క్రెడిట్, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడంతో ఇది సాధ్యపడిందని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 22 శాతం పెరగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రోడ్లు, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం 10 శాతం మాత్రమే ఉందని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో 5 వేల 233 కోట్ల రూపాయల విలువ చేసే జాతీయ రహదారులకు శంకుస్థాపనాలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సభలో నితిన్ గడ్కరీ మాట్లాడుతూ... దేశంలో శరవేగంగా జాతీయ రహదారుల నిర్మాణ జరుగుతోందని అన్నారు. దేశ ప్రగతికి రహదారులు, కమ్యూనికేషన్లు చాలా కీలకమని తెలిపారు. భారతదేశం మూడవ ఆర్థిక వ్యవస్థగా ఉందని ఆయన గుర్తు చేశారు. రైతులు కేంద్ర ప్రభుత్వం చొరవతో వ్యవసాయం మాత్రమే కాకుండా విద్యుత్ ఉత్పత్తిని చేసే స్థితికి చేరుకున్నారని అన్నారు. హైదరాబాద్, విజయవాడల మధ్య గ్రీన్ హైవే ఎక్స్ ప్రెస్ ని నిర్మిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నౌకాశ్రయాల పాత్ర ముఖ్యంగా ఉందని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.... దేశంలో రోజుకు 37 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం జరుగుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కి కేంద్ర ప్రభుత్వం సహాయం అన్ని విధాలుగా

లభిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత విడుదల సందర్భంగా ఈ రోజు బీహార్‌లోని పాట్నాలో రైతులతో నిర్వహించిన సభలో ప్రసంగించారు. రైతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్మడానికి లాభదాయకమైన మార్కెట్లను పొందగలిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. అందుకోసం మెరుగైన రవాణా సౌకర్యాలను సైతం అందిస్తోందని చెప్పారు. ఉత్పాదకతను పెంచడానికి రుణాలు, ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు వంటి అనేక రకాల సహాయాన్ని కేంద్రం సమకూరుస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధులలో పాల్గొనే అధికారుల పారితోషికాలు, గౌరవభృతిని సవరించింది. 2015 తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలను సవరించడం ఇదే తొలిసారి. తాజా సవరణ ప్రకారం బూత్ లెవల్ అధికారుల (BLOs) పారితోషికాన్ని రెండింతలు చేసింది. 2015 నుంచి ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులకు పారితోషికంగా 6 వేల రూపాయలు చెల్లిస్తూండగా.. ఇప్పుడు దానిని 12 వేల రూపాయలకు పెంచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఈరోజు నివాళులు అర్పించారు. భారతదేశానికి గర్వకారణమైన త్రివర్ణ పతాకాన్ని అందించడంలో వెంకయ్య పాత్ర చిరస్మరణీయమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి కొనియాడారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా హర్ ఘర్ తిరంగ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని దేశ ప్రజలను ప్రధానమంత్రి కోరారు. అదే విధంగా పౌరులు తమ సెల్ఫీలు లేదా ఫోటోలను harghartiranga.com వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ లో భారత్ రెండవ ఇన్సింగ్స్‌లో ఇప్పటి వరకూ 6 వికెట్ల నష్టానికి 283 పరుగులు చేసింది. దీంతో భారత్ 260 పరుగుల ఆదిక్యంలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, సిక్కింలలోని కొన్ని ప్రాంతాల్లో రానున్న 24 గంటలలో అత్యంత భారీ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంటూ... భారత వాతావరణ శాఖ (IMD) రెడ్ అలర్ట్ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =